www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 24 మే 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



జగనన్న కాలనీ నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు

నవరత్నాల పథకంలో భాగంగా పేదలందరికీ శాశ్వత గృహ వసతి కల్పించే దిశగా రూపొందిస్తున్న జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను వేగవంతం చేసి, పూర్తి చేసిన గృహాలను లబ్ధిదారులకు అందజేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఇనమడుగు లే అవుట్ జగనన్న కాలనీ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ లబ్ధిదారుల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న గృహాలలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులు లే అవుట్ల నిర్మాణ పనులు, అభివృద్ధి పనులను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. హౌసింగ్ కార్పొరేషన్ విభాగం అధికారి దయాకర్, సిబ్బంది, నగర పాలక సంస్థ అధికారులు, సచివాలయ వార్డు ఎమెనిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

చంద్రబాబుతో 'ఆనం' భేటీకి సన్నాహాలు..!

- 25 లేదా మహానాడు తరువాత అవకాశం
- బాబు అపాయింట్‌మెంట్ కోరిన ఆనం
- ఎక్కడ చెబితే అక్కడ నుంచే పోటీ

వైసిపి బహిష్కరణ వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి టిడిపి అధినేత చంద్రబాబునాయుడుతో భేటీకి సన్నాహాలు జరుగుతున్నాయి. జిల్లాలో సీనియర్ రాజకీయ నేతగా, వైసిపిలో ఇమడలేక బయటకొచ్చిన ఆయన టిడిపిలో చేరడానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే చంద్రబాబు నాయుడు అపాయింట్‌మెంట్ కోరినట్లు తెలిసింది. ఈనెల 25 లేదా మహానాడు తరువాత భేటీకి అవకాశాలున్నట్లు సమాచారం. తనను ఎక్కడ నుంచి పోటీ చేయమంటే అక్కడ నుంచి పోటీ చేస్తానని తన అనుచరులతో చెప్పినట్లు తెలిసింది. ఆనం తరువాత మరికొందరు నేతలు చంద్రబాబునాయుడును కలిసి పార్టీలో చేరడానికి సిద్ధపడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. టిడిపి మహానాడు రాజమండ్రిలో జరుగుతున్నందున దానికి ముందా, తరువాత తేలాల్సి ఉంది..



నారా చంద్రబాబునాయుడు

ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సీనియర్ రాజకీయ నేత వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి టిడిపిలో చేరడానికి సన్నాహాలు సాగుతున్నాయి. ఇప్పటికే వైసిపి నుంచి బయటకొచ్చిన ఆయన ఆపార్టీ గురించి ఎక్కడా ఏమీ ప్రస్తావించడం లేదు. ఆయన టిడిపి నుంచి పోటీ చేయడం దాదాపు ఖరారైంది. ఎక్కడ నుంచి అనేది చంద్రబాబునాయుడు తేల్చనున్నట్లు సమాచారం. వైసిపి నుంచి బయటకొచ్చిన తరువాత ఆనం రామనారాయణరెడ్డిని వైసిపి ఇబ్బందులకు గురిచేస్తుంది. ఆయన అనుచరులకు ఏ పనులు జరగకుండా, ఆహ్వానం లేకుండా చేసింది. స్వయంగా ఎంఎల్ఎగా ఆయనకు ఏలాంటి ఆహ్వానం అందడం లేదు. కొద్ది రోజులుగా మౌనంగా ఉన్న ఆయన ఏదొక నిర్ణయం తీసుకోడానికి సిద్ధమైనట్లు సమాచారం. ఇప్పటికే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును కలవడానికి అపా యింట్‌మెంట్ కోరినట్లు తెలిసింది. ఈనెల 25 లేదా రాజమండ్రి మహానాడు తరువాత భేటికి అవకాశాలున్నట్లు సమా చారం. చంద్రబాబునాయుడు బిజీబిజీగా ఉండడంతో సమయం చూసి టైమ్ ఇస్తారని తెలుస్తోంది. ఈనెల 27-29 వరకు రాజమండ్రిలో టిడిపి మహానాడు జరగనుంది. ఆయన అంతకు ముందే విజయవాడ వస్తారని సమాచారం. ఆనం రామనారాయణరెడ్డి స్పీడ్ పెంచారు. నిన్న మొన్నటి వరకు మౌనంగా ఉన్న ఆయన తన మనస్సులోని భావాలను మిత్రులు, మీడియా, సన్నిహితులతో పంచుకున్నట్లు తెలిసింది. ఇటీవల వరికుంటపాడు మండలం, పాములవారిపల్లిలో ఓ సీనియర్ రాజకీయ నేత ఇంట్లో జరిగిన ఖర్మక్రతులకు హాజరయ్యారు. ఇక్కడకు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, బొల్లినేని రామారావు, కంభం విజయరామిరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆనం రామనారాయణరెడ్డి తన మిత్రులు, మీడియాతో మాట్లాడుతూ తాను ఎంపిగా కాకుండా, ఎంఎల్ఎగా పోటీ చేస్తానని, చంద్రబాబునాయుడు ఎక్కడ నుంచి పోటీ చేయమంటే అక్కడ నుంచి పోటీచేస్తానని చెప్పినట్లు తెలిసింది. 60 శాతం మంది వైసిపి ఎంఎల్ఎలు బయటకు రాడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపినట్లు సమాచారం. చంద్రబాబు నాయుడు, ఆనం రామ నారా యణరెడ్డి భేటి కావడం దాదాపు ఖరారైంది. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసే అవకాశాలున్నాయి. ఆనం భేటి తరువాత మరికొందరు ఎంఎల్ఎలు చంద్రబాబుతో కలిసి టిడిపిలో చేరడానికి సన్నాహాలు సాగుతున్నాయి.

మీడియాతో మాట్లాడుతున్న కోటంరెడ్డి

'కోటంరెడ్డి' ఇంటి వద్ద ఉద్రికత్త..!

-హౌస్ అరెస్ట్, ఆఫీసు వద్ద నిరసన
-మళ్లీ ఉద్యమం చేపడుతా- కోటంరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

క్రిస్టయన్ కమ్యూనిటీ హాల్ కోసం శాంతియుత నిరసన తెలపడానికి సిద్ధమైన ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. మంగళవారం తెల్లవారుజామున మాగుంట లేవుట్‌లోని ఆయన నివాసం వద్ద భారీగా పోలీసులు చేరుకున్నారు. ఇంట్లో నుంచి బయట రానివ్వకుండా అడ్డుకున్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే అరెస్ట్ చేయడం సరికాదన్నారు. మీడియాను ఇంట్లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రికత్త పరిస్థితులు నెలకొన్నాయి. చర్చ్ ఫాస్టర్లు ఆయన ఇంటికి వచ్చి ప్రార్థనలు చేశారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన అభిమానులు కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. పెద్ద ఎత్తున చర్చ్ ఫాస్టర్లు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. గొడుగులతో నిరసన తెలిపారు. ఉద్యమం ఇంతటితో ఆగదని, గెరిల్లా స్థాయిలో పోరాటం చేస్తామని శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. అరెస్టలతో ప్రజా ఉద్యమాలను ఆపలేరన్నారు. తనను దుర్మార్గంగా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారన్నారు. ప్రజా సమస్యలు ప్రశ్నించడమే నేరమా అని ప్రశ్నించారు. క్రిస్టియన్‌ల కోసం ఆరు నుంచి ఏడు కోట్ల రూపాయలు విడుదల చేయాలని కోరుతున్నానని, ఇది వేలాది మందికి ఉపయోగ పడుతుందన్నారు. బ్రిటిష్ పాలకుల కంటే దారుణంగా జగన్ రెడ్డి పాలన ఉందన్నారు. శ్రీధర్‌రెడ్డి అరెస్ట్‌తో ఆయన అనుచరులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు.

'ఆదాల'తో భేటి..!

నెల్లూరు :వైసిపి రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షులు ఎం.సుదీర్ కుమార్, ఎంపి ఆదాల ప్రభా కర్‌రెడ్డిని ఆయన నివా సంలో కలిశారు. మంగళ వారం రామ్మూర్తి నగర్ లోని ఆదాలతో ఆయన భేటి అయ్యారు. పార్టీ అభివృద్ధి కష్టపడి పనిచేయాలని, నెల్లూరు రూరల్‌తోపాటు, జిల్లా వ్యాపితంగా పార్టీ విజయానికి కృషి చేయాలని ఆదాల కోరారు.

ఆదాలను కలిసిన ఎం. సుధీర్‌కుమార్

మహిళా రెజ్లర్లకు సంఘీభావం

ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్‌కె మస్తాన్ బి

ప్రజాశక్తి -నెల్లూరు :మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాల్సిందేనని ఐద్వా నేతలు డిమాండ్ చేశారు. లైంగిక వేధింపులను నిరసిస్తూ ఢిల్లీలో ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లకు మద్దతుగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళ వారం ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత 30 రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహిళా రెజ్లర్లు ఆ సంఘం యొక్క అధ్యక్షుడు, బిజెపి ఎంపి అయిన బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా మల్లయోధులకు న్యాయం చేయాలన్నారు. బిజెపి ప్రభుత్వం మను వాద భావజాలాన్ని మతతత్వాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్య చిచ్చు పెడుతుందన్నారు. బేటి బచావో బేటి పడావో అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన బిజెపి బాళికలు, మహిళలపై హత్యలు అత్యాచారాలకు పాల్పడేవారిని ఎంపిలు, ఎంఎల్ఎలను చేస్తూ క్రిమినల్స్‌కు అడగ్గా బిజెపి మారిందని దుయ్యబట్టారు. భారత దేశ ఖ్యాతిని ప్రతిష్టను పెంచడానికి ఎంతో కృషి చేసిన మహిళా మల్ల యోధులు రాజధాని నడిబొడ్డులో ఎండనక.. వాననక. పోరాటం చేస్తున్నారన్నారు. అయినా బిజెపి ప్రభుత్వంలో ఇప్పటివరకు స్పందన లేకపోవడం, ఎంపిపై చర్యలకు మీనమేషాలు లెక్కించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు షేక్ మస్తాన్ బి, టి శివకుమారి, కె పద్మ , ఎన్ వి సుబ్బమ్మ ,శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ డి అన్నపూర్ణమ్మ, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు రమణ, నరసింహ, ఆవాజ్ నాయకులు రషీద్, ఫయాజ్, నగేష్ ఉన్నారు.

'నాడు-నేడు' పనులు వేగవంతం

ప్రజాశక్తి-నెల్లూరు

"నాడు - నేడు" అభివృద్ధి పనులను వేగవంతం చేసి పాఠశాలల పునప్రారంభం నాటికి అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలను అందుబాటులోకి తీసుకురావాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మహాత్మా గాంధీ నగర్ ఉర్దూ పాఠశాల, మున్సిపల్ పాఠశాల, పడారుపల్లి మున్సిపల్ పాఠశాలల్లో జరుగుతున్న నిర్మాణ పనులను కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం స్థానిక పోలీస్ కాలనీలోని మున్సిపల్ పార్కును సందర్శించారు. పబ్లిక్ హెల్త్ అధికారి అలీ, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ సంపత్ కుమార్, ఈ.ఈ శేషగిరిరావు, ఎఇ అర్పిత ఉన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు

ప్రజాశక్తి -నెల్లూరు

క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యాచరణలో భాగంగా నగర పాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్న డోర్ టు డోర్ చెత్త సేకరణలో తడి, పొడి చెత్తను విడివిడిగా అందించి మెరుగైన పారిశుధ్య నిర్వహణకు సహకరించాలని కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. మంగళవారం స్థానిక 35వ డివిజన్ శానిటేషన్ మస్టర్ పాయింట్లను కమిషనర్ తనిఖీ చేసి శానిటేషన్ సిబ్బంది హాజరును పరిశీలించారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు అయిన సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక షాపుల నిర్వాహకులతో కమిషనర్ ప్రత్యక్షంగా మాట్లాడుతూ ప్రతీ దుకాణం బయట తడి, పొడి చెత్త సేకరణకు విధిగా డస్ట్ బిన్ లను ఉంచాలన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, సూపర్వైజర్లు, శానిటేషన్ ఇన్స్పెక్టర్ లు, సచివాలయం శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

కోవూరు నియోజకవర్గ స్థాయి
సిపిఎం నూతన సమన్వయ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు సిపిఎం నియోజకవర్గ స్థాయి నూతన సమన్వయ కమిటీ ఎన్నికైంది. మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య కళ్యాణ మండపంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. నియోజకవర్గ కన్వీనర్‌గా తుళ్లూరు గోపాల్, మరో 21మందితో కమిటీని ఎన్నుకున్నారు.

తుళ్లూరు గోపాల్, కోవూరు నియోజకవర్గ సిపిఎం కన్వీనర్

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి : టిడిపి

ప్రజాశక్తి -కందుకూరు :విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ పట్టణంలోని కోవూరు రోడ్డులో సబ్ స్టేషన్ వద్ద మంగళవారం టిడిపి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన జరిగింది. టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నియోజ కవర్గ పరిశీలకులు కె.కుసుమకుమారి హాజరయ్యారు. కుసుమ కుమారి మాట్లా డుతూ వైసిపి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్యులపై భారం మోపారని విమర్శించారు. పట్టణ ప్రధాన కార్యదర్శి ఎం శీను, రాష్ట్ర నాయకులు చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, కూనం నరేంద్ర, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, నియో జకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు నాదెళ్ల వెంకట సుబ్బారావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పోడపాటి మహేష్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాసరావు, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు వడ్డెళ్ళ రవిచంద్ర, చుండూరి శ్రీను, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు వేణు, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు చవిడిబోయిన వెంకటకష్ణ ఉన్నారు.

వేసవి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి -ఉలవపాడు :ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం మొత్తం 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరితో ముందుగా పుస్తక పఠనం చేపించి అనంతరం క్విజ్ పోటీని నిర్వహించారు. ఈ పోటీలో మంచి కష్టమైన ప్రశ్నలకు కూడా సమాధానాలు చెప్పి ఆడియన్స్‌ను ఆకట్టుకున్నారు. ఇందులో గెలుపొందిన విజేతలకు ఆది వారం బహుమతులు అందజేస్తారు. విద్యార్థులకు ఆట వస్తువులు ఇచ్చిన పిల్లల వైద్యులు ఎం సతీష్‌కి గ్రంథపాలకుడు డి కోటేశ్వరరావు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి -ఉలవపాడు :ఉలవపాడు ఆసుపత్రిలో రాష్ట్ర వైద్య విధాన పరిషత్ జిల్లా వైద్యశాలల సమన్వయకర్త డాక్టర్ రమేష్ నాథ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 11.45 గంటల సమయంలో జిల్లా అధికారి రిసెప్షన్ ఏరియాలో కనిపించడంతో సిబ్బంది అందరూ ఒక్కసారిగా అలెర్ట్ అయ్యారు. తొలుత ఆరోగ్యశ్రీ కౌంటర్ దగ్గరకు వెళ్లి ఆరోగ్య మిత్రల ద్వారా అందుతున్న సేవల గురించి తెలుసు కున్నారు. ఆస్పత్రిలో కాన్పు అయిన గర్భిణులకు ప్రభుత్వం ద్వారా వస్తున్న ఆసరా పథకం డబ్బులు కొంతమందికి అందక పోవడానికి కారణాలు అడిగారు. గర్భవతిగా ఉన్నప్పుడే ప్రతి గర్భవతి పేరు నవశకం పోర్టల్ లో ఉండేలా చూడాలన్నారు. తరువాత ఆసుపత్రిలోని లాబరేటరీ, అత్యవసర గది, కాన్పులు గది, ఆపరేషన్ గది, డిస్పెన్సరీ, వార్డులు అంతా తిరిగి రికార్డులు పరిశీలించారు.

రాష్ట్ర స్థాయి పురస్కారాలకు
ముగ్గురు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-నెల్లూరు :ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో బిసి సంక్షేమ హాస్టళ్లలో అత్యధిక మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి పురస్కారాలకు జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ సంక్షేమ హాస్టళ్లలో మొదటి 10 ర్యాంకులు సాధించిన 18 మంది మంది విద్యార్థులను ఈనెల 24న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సత్కరించనున్నట్లు తెలిపారు.

మైనింగ్ అధికారులకు శిక్ష తప్పదు..!

సిలీకా భూముల్లో టిడిపి నేతల పర్యటన

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఓఎంసి కేసులో శ్రీలక్ష్మికి పట్టిన గతే రేపు మైనింగ్ అధికారి వెంకటరెడ్డికి పట్టబోతోందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిల్లకూరు మండలంలోని సిలీకా భూముల్లో ఆయన పర్యటించారు. అక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదల భూముల్లోనూ సిలికా దోచేస్తుంటే అధికారులు ఎన్‌ఓసిలు ఇవ్వడం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వ అధికారుల మనుకుంటున్నారా..వైసీపీ కార్యాలయాల్లో గుమస్తాలుగా ఫిక్స్ అయ్యారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఈ పాపంలో భాగస్వాములందరూ ఫలితం అనుభవించడం ఖాయమన్నారు. గూడూరు డివిజన్‌లో లభించే అరుదైన, నాణ్యమైన సిలికా అక్రమ మైనింగ్‌తో వేల కోట్లు దోచేస్తున్నారు..ఇప్పటికే రూ.3 వేల కోట్లు దోచేశారని, తమ పర్యటనలో ఏ యార్డులో చూసినా లక్ష నుంచి ఒకటిన్నర లక్షల టన్నుల సిలికా కనిపిస్తోందన్నారు. రూపాయికి 10 పైసలు పన్ను వేస్తేనే దేశమంతా తిరగబడి బ్రిటిష్ పాలకులను తరిమికొట్టారని, రూపాయికి 90 పైసలు పన్ను వేస్తున్న జగన్ రెడ్డిని ఏం చేయాలన్నారు. మైన్ల యజమానులకు టన్ను సిలికాకు రూ.100 చెల్లిస్తూ రూ.1485కి అమ్ముకుంటున్నారన్నారు. బల్లవోలు తదితర గ్రామాల్లో ప్రభుత్వ అసైన్మెంటు భూములను అనాధిగా సాగుచేసుకుని జీవనాధారం పొందుతున్న పేద రైతుల మెడపై కత్తి పెట్టి ఖాళీ చేయించారన్నారు. టన్నుకు రూ.30కి వారికి చెల్లించి ఆ సిలికాను రూ.1485కి అమ్మి దోచుకుంటు న్నారన్నారు. ఇదేందని ప్రశ్నించిన 33 మంది దళితులపై కేసులు కట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిలికా అక్రమ మైనింగ్ చేస్తున్నది జగన్ బినామీలే..వాళ్లంతా నెలకు రూ.20 కోట్లు లోటస్ పాండ్‌లో చెల్లిస్తున్నారని, . మధ్యలో బ్రోకర్లు మరో రూ.5 కోట్లు భోంచేస్తున్నారన్నారు. గూడూరు డివిజన్ లో మైనింగ్ మాఫియా అక్రమాలు, ఆగడాలను, అరాచకాలను ప్రత్యక్షంగా చూపిస్తానని మైనింగ్ ఎండికికు సవాల్ విసిరానని, ఇప్పటి వరకు సమాధానం లేదన్నారు.గూడూరు ఆర్‌డిఒకు కూడా కళ్లు కనిపించడం లేదా . డీకేటీ పట్టాలు రద్దు చేసి వామన బ్యాచ్ కు నో అబ్జక్షన్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని,..మరీ ఇంత బరితెగింపా అని అన్నారు. సిలికా మైన్ల పరిశీలన కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్, గూడూరు మాజీ శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్, వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకష్ణ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

సిలికా భూములను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్

రామయ్యను అహ్వానిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -కందుకూరు

ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రగతికి అందిస్తున్న అవకాశాలను బంగారు భవితకు బాటలుగా మార్చుకోవాలని ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ ఉద్బోధించారు. మంగళవారం కళాశాల ఆడిటోరియంలో ఘనంగా ఏర్పాటు చేసుకున్న స్పెక్ట్రా సాంకేతిక కల్చరల్ ఫెస్ట్‌ను ఆయన ఆన్ లైన్ ద్వారా ప్రారంభించారు. స్వయంగా విద్యార్థులే నిర్వహిస్తున్న రెండు రోజులు ఫెస్ట్ విజయవంతం కావాలని వీడియో ప్రసంగంలో ఆకాంక్షించారు. నాలుగేళ్ల ఇంజినీరింగ్ కోర్సులో అకడమిక్స్‌లో కూడా ఇలాగే రాణించి తల్లిదండ్రులకు, కాలేజీకి పేరు ప్రతిష్టలు తేవాలని శ్రీకాంత్ విద్యార్థులకు సూచించారు.

రామయ్య బిఎ.. అంటే బెస్ట్ అడ్మిన్

నంది అవార్డు గ్రహీత సూరపోగు ఏసుదాసు మాటా డుతూ తొలి సంవత్సరం విద్యార్థులు స్వయంకషి అసమా నంగా ఉందని ప్రశంసిం చారు. కాలేజీ కరస్పాండెంట్ రామయ్య డిగ్రీ బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్‌ను బిఎ బెస్ట్ అడ్మిన్ స్ట్రేటర్‌గా రెండు దశాబ్దాలలో నిరూపించుకోవడం హర్షనీయ మన్నారు. ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ అంటే కందుకూరుకు బ్రాండ్ అంబాసిడర్‌గా తీర్చి దిద్దిన ఘనత రామయ్య నిర్వహణే అన్నారు

పాటతో హుషారెత్తించిన సుబ్బారావు

సీనియర్ కళాకారుడు చలంచర్ల సుబ్బారావు మాట్లాడుతూ కాలేజీ నిర్వహణ తీరుకు ముగ్ధులమై ప్రకాశం రామయ్య స్వాగతానికి ఎప్పుడు ఆనందంగా ఆమోదం తెలుపుతు న్నామన్నారు. నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా పాటతో విద్యార్థులను అలరించారు.

ఆకాశమే హద్దుకు సహకారం : రామయ్య

కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ ప్రకాశం విద్యార్థులు ఆకాశమే హద్దుగా లక్ష్యాన్ని పెట్టుకుని చేసే కృషి అన్ని విధాలుగా సహాయ. సహకారాలు లందిస్తామన్నారు.ప్రిన్సిపాల్ సిహెచ్ రవికుమార్, సైన్స్ అండ్ హ్యూమనిటీస్ హెచ్ఓడి జి ప్రసాద్, అకడమిక్స్ ఇంన్‌ఛార్జ్ ఎస్ఎం మీరావాలి, హెచ్ఓడిలు ఎంఎం రాయుడు, జి పున్నారావు, పావని, శర్మ, విద్యార్థుల ప్రతినిధులుగా స్వాతి, కీర్తన, లక్ష్మీనరసింహులు పాల్గొన్నారు.

కోలాటం చేస్తున్న విద్యార్థులు

మెరుగైన వైద్యసేవలకు కృషి

ప్రజాశక్తి - నెల్లూరు :వైద్య ఆరోగ్య సిబ్బందికి ప్రభుత్వం నిర్వహించే శిక్షణ కార్యాక్రమాల వల్ల నైపుణ్యత పెరిగి ప్రజలకు మెరుగైన వైద్యసేవలం దించేందుకు వీలుకలుగుతుందని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర అదనపు సంచాలకులు డాక్టర్ నీలిమ అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం ఎసిఎస్ఆర్ ప్రభుత్వ వైద్యకళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎంఎల్‌హెచ్‌పి (సిహెచ్‌సి)లకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రెండో రోజు శిక్షణా కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. పెంచలయ్య ప్రారంభించి మాట్లాడారు.ముఖ్య అతిథిగా వచ్చిన రాష్ట్ర అదనపు సంచాలకులు డాక్టర్ నీలిమా, ఎన్‌హెచ్‌ఒ రాష్ట్ర ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ రమాదేవి హాజరై మాట్లాడారు. డాక్టర్ మురళీకృష్ణ, ఎసిఎస్ఆర్ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరిశ్చంద్ర సతీష్, డిపిఎంఒ (ఎన్‌హెచ్‌ఎం) డాక్టర్ బ్రహ్మేశ్వర నాయడు పాల్గొన్నారు.

నేడు కృత్రిమ అవయవాల కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -వెంకటాచలం : మండలంలోని గొలగమూడి వెంకయ్య స్వామి ఆశ్రమం వైద్యశాలలో నేడు కత్రిమ అవయవ కేంద్రం ప్రారంభించనున్నట్లు ఆశ్రమ ఇఒ బాలసుబ్రమణ్యం తెలిపారు. వెంకయ్య స్వామి ఆశ్రమంలో ఇటీవల నూతనంగా నిర్మించిన వైద్యశాలలో వికలాంగులకు కత్రిమ అవయవాలు అమర్చేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందుకు మహావీర జెన్ రిలీఫ్ ఫౌండేషన్ ట్రస్ట్ సహకారం తొ బర్డ్ హాస్పిటల్ పూర్వం డైరెక్టర్ డాక్టర్ గుడారు జగదీష్ సూచనలతో కేంద్రాన్ని ప్రారంభించబడుతుంది తెలిపారు. అవసరమైన వారు ఫోన్ నెంబర్ 6305418947 సంప్రదించాలన్నారు.

తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - లింగసముద్రం : మండలంలోని తిమ్మారెడ్డిపాలెం విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి తిరునాళ్లకు నిర్వహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. రెండు రోజులు జరిగే తిరునాళ్లలో భాగంగా మంగళ వారం గ్రామంలోని ప్రధాన వీధుల్లో స్వామివారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులు తిరునాళ్లకు గ్రామానికి రావడంతో పండుగ వాతావరణం ఏర్పడింది. దేవాలయాన్ని విద్యుత్ కాంతులతో ఆలకరించారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో ఐదు విద్యుత్ ప్రభలకు ఏర్పాట్లు చేశారు. పాటకచ్చేరి, డ్యాన్స్ కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు.

వలంటీర్లకు వందనం

ప్రజాశక్తి - లింగసముద్రం :లింగసముద్రం పంచాయతీలోని రెండు సచి వాల యాల్లో మంగళ వారం ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు వాలంటీర్లకు వందనం కార్యక్రమం సర్పంచ్ పులి రాఘవుల అధ్యక్షతన జరిగింది.ఎంపిడిఒ శేషుబాబు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు తప్పనిసరిగ్గా అందేలా చూడాల్సిన బాధ్యత వలంటీర్లు, సచివాలయం సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం వలంటీర్లకు సన్మానం చేసి వారి సేవలను గుర్తు చేసుకున్నారు. ఎంపిడిఒ యు.శేషుబాబు,వైసిపి మండల కన్వీనర్ పిచ్చపాటి తిరుపతిరెడ్డి, ఉప్పతి వెంకటేశ్వర్లు, పి ఆదినారాయణ, పంచాయితీ కార్యదర్శి మాధవ పాల్గొన్నారు.

వలంటీర్ల సన్మానంలో పాల్గొన్న ఎంపిడిఒ

అవినీతికి కేరాఫ్ సుబ్బానాయుడు

ప్రజాశక్తి-దగదర్తి : అవినీతికి కేరాఫ్‌గా టిడిపి కావలి ఇన్‌ఛార్జి సుబ్బానాయుడు ఉన్నాడని వైసిపి మండల అధ్యక్షుడు తాళ్లూరి వెంకటప్రసాద్ నాయుడు అన్నారు. వలంటీర్ వందన కార్యక్రమంలో భాగంగా శ్రీరామపురంలోని వివేకరాల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు అందించాలని చెప్పడంతో ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అలుపెరగకుండా ఎప్పుడు ప్రజల వెంటే ఉంటూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. దగదర్తిలో సుబ్బానాయుడు వార్డు మెంబర్‌కు ఎక్కువ సార్లకి తక్కువ అని, ఎంఎల్‌ఎను విమర్శించే స్థాయి కాదని విమర్శించారు. కొత్తపల్లి, కొరుగుంటలలో అక్రమ గ్రామ తవ్వకాల్లో ముగ్గురు పసిప్రాణాలు బలి తీసుకున్నారు. వివేకరెడ్డి, వైసిపినాయకులు తదితరులున్నారు.

నాణ్యతగా విద్యాకానుక కిట్లు

ప్రజాశక్తి-మర్రిపాడు : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతి సంవత్సరం అందించే జగనన్న విద్యా కానుకను ఈ ఏడాది నాణ్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు తెలియజేశారు. ఆయన మంగళవారం మర్రిపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను స్టాక్ పాయింట్‌గా ఉండేందుకు కావలి డిప్యూటీ విద్యాశాఖాధికారి హర్షప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. వారివెంట మండల ఇన్‌ఛార్జి ఎంఇఒ మాలకొండరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శివక్రిష్ణ ఉన్నారు.

పశుపెంపకందారులకు అవగాహన

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని గణేశ్వర పురం గ్రామంలో డాక్టర్ ఎస్ వి రాఘవేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం పశువుల పెంపకందారులకు అవగాహన సదస్సు, సాధారణ ఆరోగ్య శిబిరం నిర్వహించి పశువులకు వైద్యం అందజేయడంతో పాటు యాజమాన్య పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎహెచ్ సల్మాన్, మోహన్ రెడ్డి, సీడ్స్ కోఆర్డినేటర్ వేణుగోపాల్, వీఎఎ డైరెక్టర్ బాదం నారాయణ, సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపిటిసి సృజన, పాడి రైతులు పాల్గొన్నారు.

వలంటీర్లకు అభినందన కార్యక్రమం

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : మండలంలోని చేర్లోయడవల్లి, బోయిల చిరువెళ్ల, కరటంపాడు సచివాలయం పరిధిలో సంబంధిత వాలంటీర్లకు మంగళవారం ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, ఎంపిడిఒ ఎస్.శ్రీనివాసులు అధ్యక్షతలో వాలంటీర్లకు అభినందన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామ ప్రజల కోసం వాలంటీర్ల వ్యవస్థ ఏర్పడిందని, కానుక ప్రభుత్వం అందించే ప్రతి స్కీమ్‌ను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు అందించి వారి మన్ననలు పొంది ప్రభుత్వానికి మంచిపేరు తీసుకొవాలని ఆయన కోరారు. ఎంపిడిఒ మాట్లాడుతూ వాలంటీర్లు వనితేం, బయోమెట్రిక్ హాజరు, ఆన్‌లైన్ సర్వే, ఇకెవైసి ఆన్‌లైన్ ఆధారంగా వాలంటీర్ల సేవలను ప్రభుత్వం నేరుగా గుర్తించి సేవ వజ్ర, సేవారత్న, సేవ మిత్ర అవార్డులను అందజేశారు. మండలంలో 5 సేవారత్న 155 సేవామిత్ర అవార్డులు మంజూరు చేసినట్లు, వాటిని ఆయా వాలంటీర్లకు అందజేసినట్లు ఎంపిడిఒ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సంపూర్ణ, అంకయ్య, షేఫ్, చెర్లో యడవల్లి సర్పంచ్ చేర్డి శ్యామల, బోయిలచిరువెళ్ల సర్పంచ్ బి.వెంకటేశ్వర్లు, కరటంపాడు ఎంపిటిసి షేక్ ఖాసింసా, సచివాలయం సిబ్బంది, కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆటోస్టాండ్‌ను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పట్టణంలో మున్సిపల్ బస్టాండ్, సోమశిల రోడ్డు సెంటర్ ప్రాంతంలో తమ వాహనం నిలుపుకునేందుకు స్థలం కేటాయించాలంటూ సిఐటియు మండల అధ్యక్షులు కార్యదర్శులు నాగయ్య ఆధ్వర్యంలో మంగళవారం డిఎస్‌పి కోటారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ ఇటీవల నూతన బస్టాండ్ నిర్మాణం చేపట్టడంతో ఆటో కార్మికులకు అక్కడ ఆటోలో నిలపడానికి స్థలం లేక నానా అవస్థలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ సమస్యను అధికారులు మున్సిపల్ బస్టాండ్ వద్ద సోమశిల సెంటర్ ప్రాంగణాలలో ఆటోలు నిలుపుకోవడానికి ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలవకుండా ఆటో డ్రైవర్లు క్రమశిక్షణతో ఉంటారని ఆయన తెలిపారు. ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-కావలి : సోమవారం సాయంత్రం 7 గంటల సమయంలో సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో కావలి పట్టణం పెంకుల ఫ్యాక్టరీ చెరువు కట్ట గిరిజన సంఘంలో "లివిజిలిన్ ద్వారా బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన" కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రైల్వే ఎస్ఐ అరుణ కుమారి, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి, సంయుక్త సేవాసంస్థ సభ్యులు ఎం.ఆజిజ్ బాబు, నేలటూరి.శివ ప్రసాద్ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ జె వి శారద, విజయ్ భారత్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వై.కిరణ్ కుమార్, మహిళా కానిస్టేబుల్ ప్రమీల, వలంటీర్లు ఎన్ డి.ఖదీర్, షేక్.రషీద్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-కావలి : అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం కావలి పట్టణ అష్టలక్ష్మి నగర్ కారుణ్య కోచింగ్ సెంటర్ వద్ద హ్యాపీ సేవాసంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సయ్యద్ ఘనీభాషా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రతిఒక్కరూ ఒక మొక్కను ఆయన నాటాలన్నారు. కార్యక్రమంలో కారుణ్య కోచింగ్ సెంటర్ డైరెక్టర్ కె.శివనారాయణ, వారిశ్రీమతి కె.లత, సంస్థ సభ్యులు మారుబోయిన, నాగరాజు, షేక్.కరీముల్ల, విద్యార్థులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం

ప్రజాశక్తి-దగదర్తి : వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేరవేసిన వలంటీర్లను వందన కార్యక్రమంలో భాగంగా ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు. మండలంలో వందన కార్యక్రమంలో ఎంపికైన వలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి తాళ్లూరి వెంకట ప్రసాద్ నాయుడు, ఇండ్ల వెంకటసుబ్బయ్య, వలంటీర్లు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లే వారధులు

ప్రజాశక్తి-ఉదయగిరి : సచివాలయానికి-ప్రజలకు మధ్య గ్రామ వాలంటీర్లే వారధులని జిల్లా జెడ్‌పి కోఆప్షన్‌మెంబర్ గాజుల తాజుద్దీన్ ఎంపిటిసి సుభహన్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయగిరి బిట్-2లో నోడల్ ఆఫీసర్ తహశీల్దార్ సాహ్ శ్రీనివాసులు రెడ్డి, అప్పసముద్రంలో ఇఒపిఆర్‌డి నరసయ్య అధ్యక్షతన వలంటీర్లకు వందన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా కోఆప్షన్ మెంబర్ తాజుద్దీన్, ఎంపిటిసి సుభహన్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్, మండల కోఆప్షన్ సభ్యులు సుభాని కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసన్న, నారాయణ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో వినియోగదారులపై భారం

ప్రజాశక్తి-కోవూరు : జగన్ సర్కార్ అనాలోచిత అవినీతి నిర్ణయంతో విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపడం దారుణంగా ఉందని కోవూరు టిడిపి ఇన్‌ఛార్జి పోలం రెడ్డి దినేష్ రెడ్డి అన్నారు. పట్టణంలోని సబ్ స్టేషన్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఇంతా మల్లారెడ్డి, టిడిపి నాయకులు చైతన్య బెల్లంకొండ విజయ, ఫిరోజ్, పాలూరి వెంకటేశ్వర్లు, పస్నెం వంశీ కృష్ణ, శ్రీధర్ నాయుడు, హేమంత్, నాటకాల వెంకట్, రవికుమార్, జగదీష్, హరి, దారా విజయబాబు, చిరంజీవి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-విడవలూరు : కోవూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి ఆదేశాల మేరకు టిడిపి నాయకులు మంగళవారం విడవలూరు సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు చెముకుల కృష్ణచైతన్య, మాతురు శ్రీనివాసుల రెడ్డి, కేతమల శ్రీనివాసులు, సత్యం రెడ్డి, ఇమామ్ బాషా, రామీసెట్టి వేంకటేశ్వర్లు, కుడుముల సుబ్రహ్మణ్యం, కుమారెడ్డి, మంచాల అజయ్, మండల మహిళా అధ్యక్షురాలు కామేశ్వరమ్మ, షఫీ, హరిబాబు, హర్ష, తాటిపర్తి సుధాకర్, నక్కా సుమన్, బుట్టల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

25న కోవూరులో బహిరంగ వేలం

ప్రజాశక్తి-కోవూరు : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కోవూరు పోలీసు స్టేషన్‌లో మూడు ద్విచక్రవాహనాలు, ఒక మినీ ట్రక్కు మొత్తం నాలుగు వాహనాలు బహిరంగ వేలం పాట నిర్వహించి విక్రయించనున్నట్లు ఎస్ఇబి సిఐ సహరి అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆర్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆదేశాల మేరకు వేలం పాటలు నిర్వహిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు కోవూరు ఎస్ఇబి పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-అల్లూరు : మండల కేంద్రం స్థానిక నగర పంచాయతీలో మంగళవారం కావలి ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి గడపగడప కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యకర్తలు నేతలు ఆయనకు బ్రహ్మరథం పట్టి పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుండి నిరంతరం పేద ప్రజల కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ'లో అక్రమాలు..!

- ఉపాధి కూలీల ఎటిఎం కార్డులు తీసుకున్నారు..?

మండుటెండలో 'ఉపాధి' పనులు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

నిరుపేదలకు ఉపాధి కల్పించిన తద్వారా వలసలు నివారించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎంజి ఎన్‌ఆర్‌ఇజిఎస్) పథకాన్ని అమలులోకి తెచ్చిన విషయం తెలిసిందే. 25.08.2005న ఉపాధి హామీ చట్టం అమల్లోకి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నిరుపేద కుటుంబంలో కోరిన వారికి 100 పని దినాలు కనీస వేతనం వచ్చేలాగా చట్ట పరమైన హామీ ఇవ్వబడింది. ఈ పథకం కొన్ని ప్రాంతాల్లో నిబంధనల ప్రకారం అమలవుతూ నిరుపేదల జీవితాలలో వెలుగులు నింపుతుండగా మరికొన్ని ప్రాంతాల్లో ఈ పథకం తూ..తూ మంత్రంగా జరుగుతోంది. అధిక శాతం ఈ పథకం అక్రమార్కుల పాలిట వరంగా మారుతోంది. ఫలితంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశం ఘోరంగా విఫలమవుతోంది. అక్రమార్కులకు వరంగా మారుతున్న ఈ పథకం గురించి సేకరించిన మేరకు వివరాలల్లోకి వెళితే...

మండలం లోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకం నిరుపేద కుటుంబాలకు 8,362 జాబ్ కార్డులున్నాయి. వీటిలో సుమారుగా 50 శాతం కుటుంబాలు మాత్రమే ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నట్లు తెలుస్తోంది. మిగిలిన 50 శాతం కుటుంబాలు ఈ పథకాన్ని వినియోగించు కోవడం లేదని తెలిసింది. ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకోని ఈ 50 శాతం కుటుంబాలు కూలి పనులకు హాజరవుతున్నారంటూ రికార్డుల్లో నమోదవు తుండడం గమనార్హం. ఉపాధి పనులకు వెళ్లని ఈ 50 శాతం కుటుంబాలకు మంజూరవుతున్న కూలీ సొమ్ములు స్వాహా అవుతున్నాయన్న ప్రచారం జరుగు తోంది. ఈ పథకం ద్వారా నిరు పేదలు లబ్ధి పొందాల్సి ఉండగా, అందుకు భిన్నం గా ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు మరి కొందరు లబ్ధి పొందుతు న్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లబ్ధి పొందుతున్నారనేకంటే దోచుకుంటున్నారని చెప్పడం సబబుగా ఉంటుందేమో. ఇక్కడ నివ్వెర పరిచే అంశం ఏమిటంటే జాబ్ కార్డులను కలిగున్న నిరుపేదలు ఉన్నారు. అందులో కూలి పనులకు వెళ్లని కూలీలకు సంబంధించిన ఆటోమేటెడ్ టెల్లర్ మెషీన్ (ఏటీఎం) కార్డులు వారి వద్ద లేకపోవడం. జాబ్ కార్డులు కలిగున్న కుటుంబాలలో కొందరు మాత్రమే ఉపాధి కూలి పనులకు హాజరవుతున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. వారు కూడా ఫీల్డ్ అసిస్టెంట్ల సంబంధీకులు కావడం గమనార్హం. వారిని మినహాయిస్తే మిగిలిన కూలీల పేర్లతో పైకం దోపిడీ అవుతోంది. ఒక రోజు కూలీ రూ.250 వరకు అందుతుందని తెలుస్తోంది. ఉపాధి పనులకు వెళ్లే 50 శాతం మంది కూలీలను మినహాయిస్తే కూలి పనులకు వెళ్లని మిగిలిన 50 శాతం మంది పేర్లతో స్వాహా అవుతున్న ప్రజాధనం లక్షల్లో ఉన్నట్లు తెలిసింది. ఈ లెక్కన గత ఐదేళ్ల క్రితం నుంచి కోట్లాది రూపాయలు ఉపాధి నిధులు దుర్వినియోగం అవుతున్నట్లు విని కిడి. ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతి, అక్రమాల గుట్టు రట్టు కాకుండా ఫీల్డ్ అసిస్టెంట్లు "తిలా పాపం.. తలా పిడికెడు" అన్న చందంగా ఈ అక్రమార్జనలో అధికారులకు కూడా వాటాలు ఇస్తున్నట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం. ఈ లెక్కన గత కొంత కాలంగా ఫీల్డ్ అసిస్టెంట్లు భారీ స్థాయిలో అక్రమార్జనకు పాల్పడడం జరిగిందన్న విషయం "కోడై కూస్తోంది". ఈ విషయం తెలుసుకున్న మండల ప్రజలు నోరెళ్లబెడుతున్నారు. ప్రభుత్వం బయోమెట్రిక్ల స్థానంలో ఏటీఎంలు తీసుకురావడంతో అక్రమార్కులు అమాయక ఉపాధి కూలీలను మోసం చేసేందుకు అవకాశం లభించినట్లు తెలుస్తోంది.

నామమాత్రంగా ఆడిటింగ్

ఉపాధి హామీ పథకం పనులపై నిర్వహిస్తున్న బహిరంగ సామాజిక తనిఖీలు నామమా త్రంగా సాగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖ ఉన్నతాధికారులు సమగ్రంగా దర్యాప్తునకు ఆదేశించి అక్రమా ర్కులపై కఠిన చర్యలు తీసుకొని, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అంతేకాకుండా ఫీల్డ్ అసిస్టెంట్ల వద్ద ఉన్న ఉపాధి కూలీల ఏటీఎం కార్డులను తిరిగి ఇప్పించాలని, దోపిడీ అయిన ప్రజాధనాన్ని తిరిగి రాబట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎటిఎం కార్డు నాదగ్గర లేదు : ఉపాధి కూలి సిద్దారెడ్డి తంబయ్య

ఎటిఎం కార్డు నా దగ్గర లేదు. ఫీల్డ్ అసిస్టెంట్ తీసుకున్నారు. ఉపాధి పథకం సిబ్బంది వద్ద ఉంది.

జాబ్ కార్డు తీసేస్తారని చెప్పారు నలబాయి అదెమ్మ

ఎటిఎం కార్డు ఇవ్వకపోతే ఉపాధి పథకం జాబ్ కార్డు తీసేస్తారని చెప్పి తీసుకొని పోయారు. కూలి పనులు కోల్పోవాల్సి వస్తుందన్న భయంతో ఎటిఎం కార్డు ఇచ్చా.

ఎటిఎం కార్డు లేదు : వెంపులూరు శ్రీనివాసులు ఎటిఎం నా వద్ద లేదు.

ఎందుకు తీసుకున్నారో తెలియదు. చాలాకాలంగా నా ఏటీఎం దగ్గర లేదు.

ఏటీఎం కావాలని అడిగాడు ఇచ్చాను : వెండికండ్ల నిరంజన్

ఏటీఎం కావాలని అడిగారు. ఇచ్చాను. మళ్ళీ నేను అడగ లేదు. నాకు ఇవ్వలేదు.

నా దగ్గర ఉండకూడదని తీసుకెళ్లారు : సిద్దారెడ్డి సీతయ్య

ఏటీఎం కార్డు నా దగ్గర ఉండ కూడదని చెప్పి తీసుకెళ్లారు. అది ఎందుకు పనికివస్తుందో కూడా తెలీదు. అడిగారు ఇచ్చాను. ఇప్పుడు కూడా నా దగ్గర లేదు.

మా దృష్టికి రాలేదు : ఎపిఒ అచ్చయ్య

ఉపాధి కూలీల ఎటిఎం కార్డులు గల్లంతు విషయం తమ దష్టికి రాలేదని ఏపిఓ అచ్చ య్య తెలిపారు.సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఒక వేళ నిర్ధారణ అయితే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దష్టికి కూడా తీ సుకెళ్తానని తెలిపారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టడమే కాకుండా విధుల నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ నాగేంద్రబాబు

'ఉపాధి' అవినీతిపై విచారణ

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి ఇందుకూరుపేట

మండలంలోని నిడుముసలి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకలపై ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు స్పందిస్తూ డ్వామా పిడి వెంకట్రావు ఆదేశాల మేరకు మంగళవారం ఎంపిడిఒ నాగేంద్రబాబు నిడుముసలిలోని ఉపాధి కూలీలను విచారించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిడుముసలి గ్రామస్తుల అభ్యర్థన మేరకు గ్రామస్తులను విచారించామని ఉపాధి పనులకు వెళ్లకుండా నగదు బదిలీ అయినా అకౌంట్లను గుర్తించి సంబంధిత ఉన్నతాధికారులకు నివేదికను పంపుతామన్నారు.

చర్యలు తీసుకుంటాం.. పిడి

ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని పిడి వెంకట్రావ్ తెలిపారు. ప్రజాశక్తి పత్రికలో వచ్చిన వార్తకు ఆయన స్పందించారు. ఉపాధి హామీ అనేకమంది పేదలకు ఉపయోగ పడుతుందని, అందులో అక్కడక్కడ అక్రమాలకు పాల్పడుతున్నారని, వారిపై విచారణ చేపట్టి, చర్యలు తీసుకుంటాం.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-సీతారామపురం

ఉదయగిరి నియోజకవర్గ టిడిపి నాయకుడు కాకర్ల సురేష్ మంగళవారం మండలంలో పర్యటించారు. మండలంలోని మారంరెడ్డిపల్లి గ్రామంలోని, ఈరి రేష్మ వివాహానికి హాజరై పెళ్లి కానుకగా రూ.10వేల ఆర్థిక సాయాన్ని, అనంతరం అంగ వైకల్యంతో బాధపడుతున్న కె.నాగయ్యను పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆయనవెంట మాజీ జెడ్పీటీసీ కె.జ్యోతి, మాజీ ఎంపిటిసి బాలస్వామి, కె.బాబు, ఎ.శ్రీనివాసులు, సుమన్, రఘురామయ్య, నవీన్, కిరణ్, తదితరులున్నారు.

ఆవాజ్ ఆధ్వర్యంలో ఉచితంగా ఖత్నాలు

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

ఆత్మకూరు ఆవాజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం 50 మంది పేద ముస్లిం పిల్లలకు ఉచిత ఖత్నా కార్యక్రమం నిర్వహించారు. ఆవాజ్ రాష్ట్ర నాయకులు ఆత్మకూరు మండలం కార్యదర్శి యస్థాని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉచిత ఖత్నా కార్యక్రమానికి ఆత్మకూరు ప్రాంతానికి చెందిన 50 మంది పేద ముస్లిం పిల్లలు ఒడుగులు చేయించుకున్నారు. ఆత్మకూరు పట్టణం ఈద్గా ప్రాంతంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వక్తలు మాట్లాడుతూ ఆవాజ్ కమిటీ ఏర్పాటుకు గల కారణాలు ఆవాజ్ కమిటీ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల గురించి ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా, స్థానిక ఆవాజ్ నాయకులు వివరించారు. ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎమ్ఎ.చిస్తి, రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎ సుభాన్, నెల్లూరు జిల్లా కార్యదర్శి షేక్ రషీద్, సిపిఎం కార్యదర్శి కె.డేవిడ్ రాజు, ఆవాజ్ బాధ్యులు ఎం.నాగేంద్ర, ఆవాజ్ మండల అధ్యక్షులు షేక్ అమీర్ భాషా, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సంధాని, పి.మస్తాన్, పి.అజ్గర్, ఆత్మకూరు నియోజకవర్గ అన్ని మండలాలకు చెందిన కమిటీ సభ్యులు ఆవాజ్, ఖత్నా నిర్వహించుకునేందుకు వచ్చిన పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖత్నా చేయించుకునే పిల్లలకు రూ.500 విలువైన ఆహార వస్తువులు అందించారు.

బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : భారత రెజ్లింగ్ క్రీడాకా రులను లైంగిక వేధింపులకు గురిచేసిన రెజ్లింగ్ సమైక్య అధ్యక్షుడు బిజెపి ఎంపి బ్రిడ్జ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చే యాలని ఆత్మకూరు ఐద్వా నాయకురాలు షేక్ గుల్జార్ బేగం, కొండ లక్ష్మమ్మ అన్నారు. మంగళవారం రాత్రి ప్రాంతంలో ఆత్మకూరు పట్టణంలోని కొవ్వొ త్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రైతు సంఘాలు కమ్యూనిస్టు పార్టీలు విద్యార్థి సంఘాలు బిజెపి ఎంపీని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్న ప్రధానమంత్రి నోరు మెదపకపోవడం చాలా దారుణమని తెలిపారు. ఇదేనా భారత దేశంలో మహిళలకు ఇచ్చిన రక్షణ గౌరవమని ప్రశ్నించారు. ఇకనైనా ప్రధాన మంత్రి స్పందించి బ్రిడ్జ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి-అల్లూరు : మండలంలోని సింగపేట గ్రామంలో మంగళ వారం కరేటి పెంచల రెడ్డి అనే రైతుకు సంబంధించిన సుమారు 25 ఎకరాల గడ్డివామి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమైంది. గ్రామ స్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా ఆ మంటలు ఆగకపోవడంతో అధికారులకు సమాచారం ఇవ్వగా మంటలను అదుపు చేశారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్

హాజరు నిర్లక్ష్యంపై ఎంపిడిఒ ఆగ్రహం

ప్రజాశక్తి-ఉదయగిరి

సచివాలయ సిబ్బంది 100శాతం బయోమెట్రిక్ హాజరు నిర్లక్ష్యంపై ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిధిలోని అప్పసముద్రం, కొండాయపాలెం సచివాలయాలను ఎంపిడిఒ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది పైఆగ్రహం వ్యక్తం చేసి 100శాతం బయోమెట్రిక్ వేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఆయుష్మాన్ భారత్ సర్వేను వేగవంతం చేయాలని ఎఎన్ఎం ఆశల సహకారం తీసుకోవాలని సూచించారు. సిబ్బంది తప్పనిసరిగా యూనిఫారంలో ఉండాలని సమయపాలన పాటించాలని ప్రభుత్వం నిర్ణయించిన గడువు లోపల లబ్ధిదారులకు వివిధ రకాలైన పత్రాలు అందజేసేందుకు చొరవ తీసుకోవాలన్నారు. గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు వస్తే శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగూర్ బి, శేఖర్, మండల కోఆర్డినేటర్ ఇమ్రాన్ ఉన్నారు.

గ్రీన్‌సిటీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కావలి

ఇందిరమ్మ గ్రీన్‌సిటీ హౌసింగ్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. మంగళవారం సిపిఎం నాయకులు సందర్శించి అక్కడ ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి ప్రజలు సిపిఎం నాయకులతో మాట్లాడుతూ తాము సుమారు 13 సంవత్సరాలుగా నివాసముంటున్నామని, ఇప్పుడు తమ కాలనీలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. 9లైన్లు ఉన్నాయని ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారన్నారు. ఈ ట్యాంకర్ ఒక్కొక్క వీధికి వచ్చేసరికి 5రోజులు నుండి 6 రోజులు పడుతుం దన్నారు. నీళ్లకు చాలా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ట్యాంకర్లు పోసే నీళు తాగేదానికి పనికి రావన్నారు. స్నానం చేసిన ఒంటిమీద గుల్లలువస్తున్నాయన్నారు. సంవత్సరాల తరబడి ఇలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. నీళ్లు, వసతులు సక్రమంగా లేక కొన్ని కాపురాలు పట్టణానికివెళ్తున్నాయన్నారు. ఈ విషయాలను ఎన్నోసార్లు ఇక్కడికి వచ్చిన అధికారులకు ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు తెలుపుకున్నప్పటికీ తమ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కనీసం తాగునీటి పరిష్కారం కూడా అధికారులు చూపలేదని తెలిపారు. అంతేకాకుండా ఈ కాలనీకి గతంలో మున్సిపల్ నీళ్లు పైపులైన్ ద్వారా వచ్చేవని, ఇప్పుడు సుమారు మూడు సంవత్సరాల నుండిమున్సిపల్ నీళు పూర్తిగా రావడం లేదన్నారు. కరెంటు కూడా రోజుకి రెండు మూడు సార్లు పోతున్నందున అనేక సమస్యలతో సతమత మవుతున్నామని సిపిఎం నాయకుల దృష్టికి తెచ్చారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ నీటి సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ అధికారులు స్పందించడం లేదన్నారు. ఐదు ఆరు రోజులకు ఒకసారి నీటి ట్యాంకరు పోయడం చాలా అన్యాయమన్నారు. ప్రభుత్వం అధికారులు ప్రజలకు సక్రమంగా నీటి సరఫరా చేయలేని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు ప్రచార ఆర్భాటాలు తప్ప ప్రజల సమస్యలు పరిష్కరించే దశలో లేరన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కదిలి రావాలని, పోరాటాలు చేసి సమస్యను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణ మోహన్, సిపిఎం నాయకులు జి.మధు సూధనరావు, తలపల రత్నం, మస్తానయ్య స్థానికులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-ఉదయగిరి

ప్రతిరోజూ తాగునీటి సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రంగనాథ్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ గాజుల తాజుద్దీన్‌తో సమీక్ష నిర్వహించారు. 20వ తేదీ శనివారం నెల్లూరులో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఉదయగిరికి రోజు నీళ్లు ఇవ్వండయ్యా అని జెడ్‌పి కోఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్ మాట్లాడిన తీరుకు వ్యక్త పరచిన ఆవేదనకు జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, కలెక్టర్ నారాయణన్ ఆదేశాల మేరకు నీటి సమస్యపై చర్చించేందుకు ఉదయగిరికి వచ్చినట్లు ఎస్ఇ రంగనాథ్ తెలిపారు. ఆనకట్టలు నూతన బోర్లు వేయుట, బోర్లకు మరమ్మతులు చేసి నీటి లభ్యతను అన్వేషించడానికి గండిపాలెం నీరు ఉదయగిరికి వచ్చే క్రమంలో సరఫరా సామర్థ్యాన్ని పెంచడం లాంటి అంశాలను చర్చించారు. ఇప్పటికీ నాలుగు రోజులకు ఒకసారి నీరు రావడం బాధాకరమైన విషయం అని సాధ్యమైనంతవరకు నీటి లభ్యత అవకాశాలను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటామని ఎస్ఇ హామీనిచ్చారు. నీటి పథకాల పునరుద్ధ రణకు ఎంపి నిధులు కూడా కేటాయించామని తెలిపారు. సమావేశంలో జిల్లా కోఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, డిప్యూటీ ఇంజనీర్ లక్ష్మణ్, ఏఈ నరసింహులు పాల్గొన్నారు.

తాజుద్దీన్‌తో మాట్లాడుతున్న రంగనాథ్

కార్మికుల వేతన బకాయిలు చెల్లింపు

- ఎంఎల్ఎకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

పట్టణంలో ప్రజా ఆరోగ్య సంరక్షకులు పారిశుధ్య కార్మికులకు 13 నెలలుగా రావాల్సిన వేతన మొండి బకాయిలను శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, చైర్ పర్సన్ మోర్ల సుప్రజ చొరవతో కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి కృషితో చెల్లించారు.దీంతో నగర పారిశుధ్య కార్మికులు మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు, చైర్ పర్సన్‌లకు కతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పూలమాలలతో ముంచెత్తారు. కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డికి రుణపడి ఉంటామని తెలిపారు.

ప్రభుత్వ లక్ష్య సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మాట్లాడుతున్న ఎంపిపి వేణుగోపాల్‌రెడ్డి

ప్రభుత్వం ఏ ఉద్దేశంతో సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారో.. ఆ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిపి కేత వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని వెన్నవాడలో ఎంపిడిఒ శ్రీనివాసులుతో కలసి ఏర్పాటు చేసిన గడపగడపకు మన ప్రభుత్వం రివ్యూ సమావేశంలో ఎంపిపి మాట్లాడారు. గ్రామంలో అభివృద్ధి కోసం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్నామని, దీని ద్వారా గ్రామాలలో వున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి గ్రామ అభివృద్ధికి దోహదం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ సచివాలయం పరిధిలో 260 సమస్యలు నమోదు కాగా 200 సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. మిగిలిన వాటిని త్వరిత గతిన పరిష్కారిస్తామన్నారు. అలాగే సచివాలయం పరిధిలోనీ నాలుగు గ్రామాల అభివృద్ధికి రూ.20 లక్షలు మంజూరు చేశారు. వీటిని అభివృద్ధి పనులకు ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పడకండ్ల సర్పంచ్ మాముడురు నరసింహులు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, భాను, వి.ఆర్.ఒ. లక్షిదేవి, సొసైటీ మాజీ అధ్యక్షులు బలరామ నాయుడు, వైసిపి నాయకులు ప్రసాద్, దాడి శ్రీనివాసులు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సుధీర్ నాయుడుకు అభినందనలు

ప్రజాశక్తి-కావలి : ఇటీవల జరిగిన రెడ్‌క్రాస్ ఎన్నికలలో జిల్లా వైస్ చైర్మన్‌గా ఎన్నికైన దామిశెట్టి సుధీర్ నాయుడును ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, ఆర్‌డిఒ శీనానాయక్‌లు అభినందించారు. మంగళవారం రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ దామిశెట్టి సుధీర్ నాయుడు ఎంఎల్‌ఎ, ఆర్‌డిఒలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి సుధీర్ నాయుడును అభినందిస్తూ, కావలి రెడ్‌క్రాస్‌కు ఉన్న మంచిపేరును నిలబెట్టాలన్నారు. విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వ శాఖలకు రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్‌గా తగు సహకారం సందించాలని కోరారు. రెడ్‌క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి ఉన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి-మర్రిపాడు : రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం విషయనిపుణులు (పంటల ఉత్పత్తి విభాగం) డాక్టర్ కె.కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. గత కొన్ని సంవత్సరాలుగా రైతులు అధిక దిగుబడులను ఆశించి విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు ఉపయోగించడం వల్ల భూమిలో పోషకాల సమతుల్యత లోపిస్తుందన్నారు. భూసార పరీక్షలు నిర్వహించడం వల్ల పంట పొలాల్లో లోపించిన పోషకాలను తెలుసుకొని సరైన మోతాదులో ఎక్కువ తక్కువ కాకుండా వేసుకోవచ్చన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకోకుండా వాడిన రసాయన ఎరువులనే తరచుగా వాడి, వాటి మోతాదును పెంచి మిగతా పోషక విలువలను తగ్గిస్తున్నారని పేర్కొన్నారు.

విశ్వబ్రాహ్మణ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-ఉదయగిరి



నెల్లూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం నూతన జిల్లా అధ్యక్షులుగా అగర సుబ్రహ్మణ్యం సోమవారం ఎంపికయ్యారు. ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన జిల్లా సంఘం అధ్యక్షులు ఆగర సుబ్రహ్మణ్యం ఆచారి, ప్రధాన కార్యదర్శి పేట విజయ్ ఆచారి, కోశాధికారి కాపులూరు కృష్ణమూర్తి ఆచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్కుట్ కుమార్ ఆచారిని ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. కావలి పట్టణంలో జరిగిన కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా విశ్వబ్రాహ్మణ సేవా సంఘంతో అనుబంధంగా పని చేస్తామని కావలి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కోవిలంపాటి హరీష్ ఆచారి వారి కమిటీ తమను ఎంపిక చేయడంపై వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంతో నమ్మకంతో తనకు ఇచ్చిన పదవికి వన్నె తేస్తానన్నారు. అనంతరం పదిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం విశ్వబ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో జిల్లాలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచి అత్యధిక 500మార్కులు సాధించిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు సన్మాన కార్యక్రమాలు జరుగుతాయని విద్యార్థుల వివరాలను సేవాసంఘంలో తల్లిదండ్రులు నమోదు చేసుకోవాలన్నారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన **ఆత్మకూరు బాల లక్ష్మీ నారాయణ,** తండ్రి **ఆత్మకూరు గోవిందయ్య, MIGH 233,** కల్లూరు పల్లి హౌసింగ్ బోర్డు, నెల్లూరు వారు ఇచ్చిన వివరముల మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా:- నా క్లయింట్‌కు తండ్రి గారైన **ఆత్మకూరు గోవిందయ్య** గారు నెల్లూరు మునిసిపాలిటీలో చేరిన వేదాయపాళెం గ్రామంలోని **సర్వే నెం.37 రు** లో భూమిని లే అవుట్ చేసి ప్లాట్లుగా విభజించిన ప్లాను దాఖలా **నెం. 115 రు ప్లాటు** విస్తీర్ణం **33 1/3 అంకణముల** స్థలమును **డి.మేరిబాయి** వగైరాల వద్ద నుండి రిజిష్టర్డు విక్రయ పత్రం **తేదీ:09-03-1981 దాక్యుమెంటు నెం.789/1981** ద్వారా కొనుగోలు చేసినారు. నా క్లయింట్ సదరు ఒరిజినల్ దాక్యుమెంటును జెరాక్స్ తీసుకొను నిమిత్తం **తే20-05-2023ది** న తన ఇంటి వద్ద నుండి స్కూటీలో అయ్యప్పగుడి సెంటర్‌లో ఉన్న జెరాక్స్ షాపుకు పోవుచుండగా మార్గమధ్యములో ఒరిజినల్ దాక్యుమెంటు పోయినది. సదరు ఒరిజినల్ **దాక్యుమెంటు నెం.789/1981** రు ఎవ్వరికైననూ దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును. సదరు ఒరిజినల్ దాక్యుమెంటును ఉపయోగించి ఎవ్వరైనా ఎట్టి లావాదేవీలు జరిపిన అవి చెల్లనేరవు. అవి నా క్లయింట్‌ను బద్ధగించవు.

Shaik Masthan Vali, B.A., L.L.B.,
Advocate, Tailors Colony, Podalakur Road,
Nellore, Cell: **99125 36499**

ఒరిజినల్ డాక్యుమెంటు పోయినది

నా క్లయింట్ అయిన **వనపంట రఘునాథ్,** తండ్రి **వనపంట బాల రాఘవ రెడ్డి,** నివాసం : నెల్లూరు సిటీ వాస్తవ్యులు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయడం ఏమనగా నా క్లయింట్ **తేది: 15-5-2023** న శ్రీ సాయి అవెన్యూ అపార్టుమెంటు, అన్నమయ్య సర్కిల్ నెల్లూరు నుండి లీలారోజ్ అపార్టుమెంటు ఇస్కాన్ సిటీ దగ్గర నెల్లూరు ఇంటి సామాన్లు తీసుకొని ఇల్లు మార్చునప్పుడు మార్గమధ్యలో **ఒరిజినల్ రిజిష్టరు డాక్యుమెంటు నెం.2366/2015** బుచ్చిరెడ్డిపాళెం సబ్ రిజిస్ట్రార్‌కు సంబంధించిన డాక్యుమెంటు పడిపోయినది. ఈ ఒరిజినల్ రిజిష్టరు డాక్యుమెంటు ఎవ్వరికైనా దొరికినయెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలిపి తగిన పారితోషకం పొందగలరు.

సజ్జల శ్రీరాములు, బి.కాం., బి.ఎల్.,
న్యాయవాది, ఫత్తేఖాన్‌పేట, నెల్లూరు.
సెల్: **94404 25295**